

కూటమి కర్కశం

- బడుగుల బతుకులపై ఉక్కుపాదం
- ఆపరేషన్ లంగ్స్ పేరిట పైశాచికం
- చిరు వ్యాపారుల బడ్డీలు, తోపుడుబళ్లు తొలగింపు.. ధ్వంసం
- సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ అభాగ్యులు


ఆపరేషన్ లంగ్స్ పేరిట జైల్‌రోడ్డు వద్ద నైట్ ఫుడ్ కోర్టును తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

ఫోకస్

డాబాగార్డెన్స్: జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు పాలించారు.. ఎక్కడా ఏ బడ్డీ తొలగించలేదు. కరోనా రెండేళ్లు తన సొంత కుటుంబంలా చూసుకున్నారు. ఆర్థికంగా ఆదుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు హాయిగా ఆయన పాలనలో ఉన్నారు. జగన్‌ను మించిన సంక్షేమం అందిస్తామని కూటమి నాయకులు కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ఆ మాటలు విని మోసపోయాం. ఏ ఒక్క సంక్షేమ పథకం అందకపోగా.. ఉద్యోగాల్లేక.. నిరుద్యోగంతో అవస్థలు పడుతున్నా.. కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. ఎవరిపై ఆధారపడకుండా రోడ్డు పక్కన బడ్డీలు పెట్టుకుని కుటుంబాల్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు మమ్మల్ని నట్టేట ముంచారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వల్ల తీవ్రంగా నష్టపోయింది బడుగు బలహీన వర్గాల వారిమే. మా బతుకులకు రక్షణ కరువైంది. మా పొట్టలు కొట్టారు. ఏళ్ల తరబడి బడ్డీలనే నమ్ముకున్నాం. కూటమి ప్రభుత్వానికి బడుగు, బలహీన వర్గాలంటే పడదు. అందుకే ఇంత పెద్ద ఎత్తున మాపై విరుచుకుపడుతున్నారంటూ చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. కనీసం ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే దౌర్జన్యంగా విధ్వంసం సృష్టించారంటూ సాక్షి వద్ద వాపోయారు. దక్షిణ నియోజకవర్గ పరిధి (జోన్–4)లో సుమారు 350 బడ్డీలు,దుకాణాలు ఆపరేషన్ లంగ్స్ 2.0 పేరిట తొలగించారు.


చిరు వ్యాపారులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి

ఇలా తొలగించారు..

ఈ నెల 18న జోన్–4 పరిధి 28వ వార్డులో సిరిపురం జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ వరకు 60 దుకాణాలు, బడ్డీలు తొలగించారు.

- 19న జోన్ పరిధి 32వ వార్డు అంబేడ్కర్ సర్కిల్ నుంచి జైల్‌రోడ్డు ఇందిరమ్మ విగ్రహం వరకు 11 దుకాణాలు తొలగించారు.
- 20న జోన్ పరిధి 31వ వార్డు అంబేడ్కర్ సర్కిల్ నుంచి జైల్‌రోడ్డు ఇందిరమ్మ విగ్రహం వరకు 157, అలాగే అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు 31, 32, 33 వార్డుల్లో రైల్వే రిజర్వేషన్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు 6 బడ్డీలు తొలగించారు.
- 21న జోన్ పరిధి 33 వార్డు లీలామహల్ జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్ వరకు 24, అలాగే 29వ వార్డులో జడ్జి కోర్టు నుంచి జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ వరకు 17 దుకాణాలు తొలగించారు.
- 22న 31వ వార్డు సింగ్ హోటల్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో 10 దుకాణాలు తొగించారు.

రోడ్డున పడ్డ బతుకులు..

జగదాంబ: కూటమి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ లంగ్స్ తమ బతుకులు రోడ్డున పడేలా చేసిందని చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. పూర్ణామార్కెట్ వద్ద వందలాది మంది చిన్నపాటి వ్యాపారాలతో పొట్ట పోసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పూర్ణామార్కెట్, స్ప్రింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చిరు వ్యాపారాలతో బతుకీడుస్తున్న వారి దుకాణాలను అర్ధంతరంగా తొలగించారు. ఈ రగడలో చిరు వ్యాపారులకు చెందిన వ్యాపారపు సరుకుతో పాటు బడ్డీలు, తోపుడు బళ్లు, చెక్కబల్లల వంటివి కూడా ధ్వంసమయ్యాయి. రెక్కాడితే కానీ డొక్కాడని వారికి ఇది పెద్ద నష్టమే అని చెప్పక తప్పదు.


దుకాణాలు తొలగింపు పట్ల నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు (ఫైల్)

బడ్డీల తొలగింపు అన్యాయం..

అల్లిపురం: ఆపరేషన్ లంగ్స్ పేరిట జీవీఎంసీ తమ పొట్ట కొట్టటం అన్యాయమని చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గ్రీన్‌పార్కు రోడ్డు, సింగ్ హోటల్ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న వారి బడ్డీలను నాలుగు రోజులుగా తొలగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఇప్పుడు తమ బడ్డీలు అడ్డమొచ్చాయా అని వారు ప్రశ్నిస్తున్నారు. బతుకు బాగుంటుందని కోరి కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి నెత్తిన పెట్టుకున్నందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బాగా బుద్ధి చెప్పారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహాయం చేసి ఆదుకున్నారని, అలాంటి నాయకుడిని కాదని కూటమికి ఓట్లు వేసి తప్పు చేశామని వాపోతున్నారు.


గ్రీన్‌పార్కు రోడ్డులో క్రేన్ ద్వారా బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది (ఫైల్)


స్ప్రింగ్‌రోడ్డులో దుకాణాల తొలగింపు (ఫైల్)


పూర్ణామార్కెట్ వద్ద రోడ్డున పడ్డ వ్యాపారులు

తాతల నుంచి బడ్డీపైనే ఆధారపడ్డాం..



గత 30 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో చిన్న బడ్డీ పెట్టుకుని పాన్‌షాప్ నడుపుతున్నాం. కేజీహెచ్ ప్రహరీకి ఆనుకునే జీవిస్తున్నాం. ఒక్కసారిగా ఇక్కడి నుంచి మా బడ్డీలు తొలగిస్తే మా పరిస్థితి ఏంటి? కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. ప్రత్యామ్నాయం చూపండి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– యమున, పాన్‌షాప్

ఎప్పటి నుంచో ఉన్నాం..



కేజీహెచ్ ప్రహరీకి ఆనుకుని ఎప్పటి నుంచో బతుకుతున్నాం. ప్రత్యామ్నాయం చూపకుండా అర్ధంతరంగా ఇలా కూలగొడితే ఎలా? జ్యూస్ దుకాణం ద్వారానే పిల్లల్ని చదివించుకుంటున్నాను. ఇప్పుడు నా పరిస్థితి ఏంటి? వడ్డీలకి అప్పులు చేశాను. రోజువారీ డబ్బులు కట్టాలి. పరిస్థితి ఏం బాగులేదు.

– భరత్, జ్యూస్ దుకాణం

స్పందించే నాథుడేడి?



టీ బడ్డీయే నా జీవనాధారం. వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా ఉన్న పళంగా పొమన్నారు. ఎలా బతకాలి? ప్రత్యామ్నాయం చూపాల్సిన వారు ఎక్కడ? ఎవర్ని అడగాలి? ఎమ్మెల్యే లేరు. కార్పొరేటర్ లేరు. మా గోడు వినేదెవరు?

– రాజు, టీ దుకాణం

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


అధినేత జగన్‌కు శ్రీవారి పంచలోహ విగ్రహం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి పంచలోహ విగ్రహాన్ని అందజేసి కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వ స్థలాలను అక్రమంగా దోచుకుంటున్న బడా బాబులను వదిలేసి, పొట్ట కూటి కోసం చిన్న చిన్న బడ్డీలు పెట్టుకుని జీవిస్తున్న చిరు వ్యాపారులను నట్టేట ముంచారని, వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు.

ఆరోగ్య రక్షణలో ఫార్మాకోవిజిలెన్స్ పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

మహారాణిపేట: రోగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మాకోవిజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి అన్నారు. బుధవారం కాలేజీ సమావేశ మందిరంలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఫార్మకాలజీ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.శ్యామల మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్ ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఏఎంసీ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వి.మన్మథరావు, డాక్టర్ ఎ.కృష్ణవేణి, ఫార్మకాలజీకి చెందిన డాక్టర్ డి.శ్యామల, ప్రొఫెసర్ డాక్టర్ కె.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బాబు హామీలు బూటకం


33వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రమేష్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం గౌరీవీధిలో నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి బాబు హామీలు మోసపూరితమైనవని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, కొల్లు సత్యవతి, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, గజ్జల బాల నారాయణరెడ్డి, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, ధర్మారావు, గౌర్ల శ్రీనివాస్ (పులి), గుంటూ రాము, వెంకటేశ్వరరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలకు స్పందన

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ మాణిక్యకుమారి నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆదేశాల మేరకు అక్షయ హాస్పిటల్ నేతృత్వంలో సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 125 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వేళాంగిణీరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొని 900 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీఓవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉందని మరిన్ని వివరాలకు 8555868681 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పని గంటల పెంపు నిర్ణయం తగదు

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచుతూ తీర్మానించడం కార్మిక వర్గానికి ద్రోహం చేయడమే అని ఏఐటీయూసీ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. మన్మథరావు, జీఎస్‌జే అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 135 సంవత్సరాల క్రితం ప్రాణం త్యాగం ద్వారా సంపాదించుకున్న 8 గంటల పని దినాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడం తగదన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగించడం అమానుషం అన్నారు. రాత్రి వేళల్లో మహిళలచే పనులు చేయించుకోవచ్చు అని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వెంటనే పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ విశాఖ జిల్లా సమితి డిమాండ్ చేస్తుందని తెలిపారు

వ్యాపారాలకు అనుమతించాలని వినతి


జోన్–4 కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు

జగదాంబ: వీధి వ్యాపారులు యథావిధిగా తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని తోపుడు బండ్ల సంఘం జగదాంబ జోన్ సీఐటీయూ ఉపాధ్యక్షుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ జోన్–4 కార్యాలయం ఎదుట తోపుడు బండ్ల వ్యాపారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు పవన్ కల్యాణ్ పేదల పక్షాన నిలబడతానని చెప్పారని.. అయితే పేదలు రోడ్డున పడుతుంటే చూస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా మీ నాయకత్వం? అని ప్రశ్నించారు. తోపుడుబండ్ల వ్యాపారుల పొట్ట కొట్టిన కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలంటూ వ్యాపారులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజు, రాము, ఎల్లాజీ, నాయుడు, దుర్గారావు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న దుర్గాలమ్మ


ధనలక్ష్మి అవతారంలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు


అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి


రాజరాజేశ్వరీదేవిగా సాగర గిరి కనకుదర్గమ్మ

డాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష చామంతులతో పూజ నిర్వహించారు. అలంకరణకు నగరానికి చెందిన ఎం.సురేష్‌కుమార్ రూ.55 వేలు చెల్లించి పూజలో పాల్గొన్నారు. అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలు లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అధినేతలు అందజేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం కనకమహాలక్ష్మి ధాన్యలక్ష్మీ అలంకరణలో దర్శనమివ్వనున్నారని ఈవో శోభా రాణి తెలిపారు.

అమ్మవారికి అన్నాభిషేకం..

టౌన్ కొత్తరోడ్డు అగ్రహారం వీధిలో వేంచేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీచక్ర నవరాత్రుల్లో భాగంగా బుధవారం 3వ రోజు అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి..

అల్లిపురం: దసరా ఉత్సవాలలో భాగంగా టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో ఉమాదేవి అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

రాజరాజేశ్వరీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ..

యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ బుధవారం భక్తులకు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులచే అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ప్రతిఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరం

ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా అల్లిపురం మెయిన్ రోడ్డులో గల శ్రీ ధనశక్తి దుర్గాదేవి ఆలయ పీఠాన్ని బుధవారం సాయంత్రం ఆయన దర్శించుకున్నారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి, టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సీపీతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గాలమ్మ..

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం కాత్యాయిని దేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు.

● కాశీ అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి..

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు బుధవారం కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల సతీష్ 150 బియ్యం బస్తాలతో గర్భాలయాన్ని సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.


శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఉత్సాహంగా అక్కినేని గానోత్సవాలు


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకుని డాబాగార్డెన్స్ ప్రేమసమాజం ఆడిటోరియంలో ఆల్‌ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అక్కినేని చిత్ర గీతాష్టమి 4వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం వెంకట్ రిథమ్స్, పల్లవీ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ఉత్సాహ భరితంగా సాగింది. గాయకులు పల్లా బాబ్జి, ఆడారి వెంకట్, అమ్మాజీరావు, రంజిత, సుజాత, పావని, వెంకటేష్, అప్పారావు, సౌమ్య ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ముందుగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, విపంచి కళాకారుల సంఘం అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, గాయనీ గాయకుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.ఫణిస్వామి, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ నిర్మాణ్ అధినేత డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, కృష్ణంరాజు, భయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మద్రిపాలెం: పౌష్టికాహారంతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బీజేపీ నాయకులు శ్యామలదీపిక, సునీల్ అగర్వాల్ అన్నారు. 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో బుధవారం నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె పరిశీలించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తత్వ పారంగతుడు సచ్చిదానందమూర్తి


ఆచార్య సచ్చిదానందమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

సీతంపేట: ఆధునిక భారతదేశంలోని తత్వశాస్త్ర కోవిదుల్లో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తిది ఒక ప్రత్యేక స్థానమని ఒడిశా రాష్ట్ర గవర్నర్ ఆచార్య కంభంపాటి హరిబాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐసీపీఆర్ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలసాఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి అనే అంశంపై మూడు రోజుల సదస్సులో ప్రసంగించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సచ్చిదానందమూర్తి విగ్రహానికి హరిబాబు నివాళులర్పించారు. ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలు, పరిశోధనలు నిరంతరం మనల్ని చైతన్యవంతులను చేస్తూ ఉంటాయన్నారు. ఆయన జీవితాన్ని బోధన, పరిశోధనకు అంకితం చేసిన విధానాన్ని వివరించారు. విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య సచ్చిదానందమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరీ



కథ లక్షణాలను వివరిస్తున్న రచయిత సత్యనారాయణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన రచయితల స్వీయ కథా పఠనం 'కథా కచేరీ' కార్యక్రమం అలరించింది. రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి సభాధ్యక్షత వహిస్తూ కథను నిర్వచించి, మంచి కథా లక్షణాలను విశదీకరించారు. ఈనాటి కథా కచేరీలో చల్లా రాంబాబు రచించిన పందిరి మంచం, భాగవతుల సత్యనారాయణమూర్తి రచన 'పరంధామయ్య గారి బస్సు ప్రయాణం', చిన సూర్యనారాయణ రచించిన 'పోయినోళ్లందరూ మంచోళ్లు', రాంపిళ్ల శివాజి రచించిన 'అమ్మ', ఎం.పరమేశ్వరరావు 'నాయనోరు', గుంటూరు సత్యనారాయణమూర్తి 'భార్య', సోమంచి వినయభూషణరావు రచించిన 'స్వాతంత్ర్యం ఖరీదు' కథలు చదివి వినిపించారు.